క్లుప్తంగా

వెంకన్నకు ఇత్తడి అండా బహూకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూ సమేత వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి డాక్టర్ శిష్టు సాహితీ ప్రియదర్శిని ఇత్తడి అండాను మంగళవారం బహూకరించారు. ప్రతి శనివారం స్వామికి ప్రసాదం నైవేద్యం కోసం ఈ అండాను బహూకరించారని అర్చకులు గోపాలాచార్యులు తెలిపారు.

ఎచ్చెర్లలో అన్నసమారాధన



అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సూర శ్రీనివాసరావు సహకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శికి సంజాయిషీ నోటీస్

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ సచివాలయ కార్యదర్శి అబ్దుల్ షాంసెం బేగంకు ఎంపీడీవో ఆర్.రమాదేవి మంగళవారం సంజాయషీ నోటీస్ ఇచ్చారు. డి.మత్స్యలేశం గ్రామ సచివాలయం ఇన్‌చార్జిగా ఆమెను నియమించగా బాధ్యతలు స్వీకరించలేదు. అధికారుల ఆదేశాలు పాటించకపోవటంపై వివరణ కోరుతూ సంజాయిషీ నోటీస్ ఇచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

సంపద కేంద్రం సందర్శన



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఎందువ గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సర్పంచులు మంగళవారం సందర్శించారు. సర్పంచులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు సంపద కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మెట్టవలసకు సుజల'ధార'



మెట్టవలస-పాలఖండ్యాం కూడలి వద్ద పనులు నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని మెట్టవలస గ్రామానికి సుజలధార నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల గ్రామంలో డయేరియా ప్రబలింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదేశాల మేరకు మంగళవారం మెట్టవలస-పాలఖండ్యాం కూడలి వద్ద స్థానిక సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథం సమక్షంలో పనులు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ప్రజలకు సుజలధార నీరు ఇవ్వనున్నారు.

గురుకులంలో చేరికకు 12 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీకి మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం సీట్లు ఎస్సీ విభాగంలో 17 ఉండగా 12 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం 12 మంది జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం అనుమతులతో ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



సతీష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో పనిచేయడం మంచి సంతృప్తి నిచ్చిందని ఎంపీడీఓ ఎం.సతీష్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నిమిత్తం విజయనగరం నుంచి శ్రీకాకుళం బదిలీపై వచ్చిన ఎంపీడీఓకు తిరిగి బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శ్రీకాకుళం ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఆర్.ప్రకాశ్‌రావు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణానికి 'పొగ'

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల వినియోగం
- చెత్తతో పాటు ప్లాస్టిక్ సంచులు కాల్చడంతో విపరీతంగా పొగ
- జెండాలు సైతం ప్లాస్టిక్‌వే..



మున్సిపల్ డస్ట్‌బిన్‌లో పాలిథిన్ కవర్లు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలో రోజురోజుకూ ప్లాస్టిక్ కాలుష్యం ఎక్కువవుతోంది. పాలిథిన్ కవర్ల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడంతో పర్యావరణానికి తీరని ముప్పు పొంచి ఉంది. రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన కర్రీషాపులు మొదలుకుని పెద్ద పెద్ద సూపర్‌మార్కెట్ల వరకు ఏది కొన్నా పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేయడం పరిపాటిగా మారింది.

పర్యావరణ ముప్పు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మార్కెట్‌కు ప్లాస్టిక్ జెండాలు, తోరణాలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమం అయిన తర్వాత చాలామంది రోడ్డుపైన చెత్తలోకి పారేస్తుంటారు.

ఆరోగ్యానికి పొగ..

పట్టణంలో సేకరించిన చెత్తను ఒకేచోట చేర్చి కాల్చుతుంటారు. ఈ సమయంలో ప్లాస్టిక్ సంచులు కూడా కలిసిపోవడంతో వాటి నుంచి డయాక్సిన్లు, కార్సినోజెన్స్, టాక్సిక్ యాసిడ్లు విడుదలవుతాయి. ఆ గాలిని పీల్చితే కళ్లు, ముక్కు, గొంతు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థకు సంబంధించిన అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రత్యామ్నాయం ఇలా..

పర్యావరణానికి ఎలాంటి హాని చేయని, పునర్వినియోగానికి పనికి వచ్చే పేపర్, వస్త్రంతో తయారైన సంచులు వాడాలి. వీటి ఖర్చు కాస్త ఎక్కువైనా రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని వీటినే వాడాలని నిపుణులు చెబుతున్నారు. వీటిపై నగర పాలక సంస్థలు దృష్టి పెట్టాలని, 120 మైక్రాన్స్ లోపు ఉన్న ప్లాస్టిక్ సంచులు వాడకూడదని చేసిన ఉత్తర్వులను పటిష్టంగా అమలు చేయాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ముప్పు..



ప్రస్తుతం అన్ని చోట్లా ప్లాస్టిక్ సంచుల వాడకం పెరిగింది. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తలో రోజుకు 150 కేజీలకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే. వాటిని కాల్చడంతో విషవాయువులు గాలిలోకి చేరి వ్యాధులకు కారణమవుతున్నాయి.

– డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, శ్రీకాకుళం



ప్లాస్టిక్‌తో తయారైన జెండాలు

• అభిమానం వెనుక అవమానం!



శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడులో కొందరు తెలుగుదేశం నాయకుల అత్యుత్సాహం విమర్శలకు దారితీసింది. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదినం సందర్భంగా సిద్ధం చేసిన ఫ్లెక్సీని అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహం మెడకు కట్టడంపై అభిమానులు మండిపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: మెరుగైన సౌకర్యాలు విద్యార్థులకు కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పొన్నాడ కేజీబీవీని మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యా సంస్థ నిర్వహణ, భోజనాల నాణ్యత, విద్యా ప్రమాణాలు, పారిశుద్ధ్యం వంటివి పరిశీలించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రత్యేక అధికారి సూర్యకళ పాఠశాల నిర్వహణ వివరించారు. విద్యార్థినులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని అన్నారు. చిన్న సమస్య ఉన్నా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంప్రదిస్తున్నట్లు చెప్పారు.

సాంకేతికతపై పట్టు అవసరం



లియో ఓవర్సీస్ కంపెనీతో ఒప్పందం చేసుకుంటున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక అంశాలపై విద్యార్థులకు పట్టు అవసరమని చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ డైరెక్టర్, లియో గ్లోబల్ ఓవర్సీస్‌కు చెందిన రీసోర్స్ పర్సన్ డాక్టర్ సతీష్‌మాకెన అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదేశాల్లో ఉన్నత విద్య వల్ల మెరుగైన వేతనాలు పొందవచ్చునన్నారు. జీఆర్‌ఈ, టోఫెల్ వంటి ప్రవేశ పరీక్షలతో విదేశీ విద్య సాధ్యంగా చెప్పారు. లియో ఓవర్సీస్ కంపెనీతో కళాశాల వివిధ అంశాలపై ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు, డాక్టర్ నాగోజీ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనపై అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్

శ్రీకాకుళం రూరల్: ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంపై మంగళవారం ఇప్పిలి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ పి.వి.ఎస్.ఆర్.మూర్తి మాట్లాడుతూ గ్రామంలో 18 ఏళ్లు దాటిన యువతకు పీఎంఈజీపీ ద్వారా స్థానికంగానే ఉపాధి లభించేలా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా సబ్సిడీ అందిస్తామన్నారు. కార్యక్రమంలో గాయిత్రీ ఉమెన్ అసోసియేషన్ ఆర్గనైజర్ ఎస్.ఉమామహేశ్వరి, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పిలి బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి హోటళ్ల సమస్యలు



మంత్రి దుర్గేష్‌ను కలిసిన హోటల్స్ అసోసియేషన్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అర్ధరాత్రి 12గంటల వరకు రెస్టారెంట్లను నడిపేందుకు అనుమతించాలని హోటల్స్, రెస్టారెంట్‌లలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రెస్టారెంట్స్ అండ్ హోటల్స్ అసోసియేషన్స్ కార్యదర్శి మెట్ట నాగరాజు, సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు అమరావతిలో పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సమస్యలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ నిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఆర్.వి స్వామి, ఐ.రఘువీర్ షెనాయ్, ఈ.వి.పూర్ణచంద్, పి.వి.రమణ, వినోద్ కుమార్, జి.శ్రీనివాస్‌రావు, సాంబశివరావు, నితిన్ చక్రవర్తి, నవీన్, ప్రతాప్ ఉన్నారు.

నేడు జన జాగరణ



సమావేశంలో మాట్లాడుతున్న కె.నాగమణి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం 'జనజాగరణ' పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ బాపూజీ కళామందిర్‌లో సాయంత్రం 5 నుంచి రాత్రి 12 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. పాటలు, డ్యాన్సులు, మిమిక్రీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో అల్లు మహాలక్ష్మి, కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, పి.గోపి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార తోట నిర్వహణ



తోటను శుభ్రం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక వెలుగు కార్యాలయం పరిసరాల్లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పౌష్టికాహార తోట నిర్వహిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ లక్ష్మున్నాయుడు చెప్పారు. పౌష్టికాహార తోట విస్తరణ పనులు, మొక్కలు నాటేందుకు స్థలం సిద్ధం చేసే పనులు మంగళవారం చేపట్టారు. ఈ తోటలో ఆకుకూరలు, తీగ జాతి పంటలు, కూరగాయలు, బొప్పాయి, అరటి వంటి పంటలు పండించనున్నట్లు పేర్కొన్నారు. వెలుగు సిబ్బంది ఈ పంటలు వినియోగించటం, అమ్మకం చేపట్టి వచ్చిన ఆదాయం తోటలు పెంపకం నిర్వహిస్తారన్నారు. పంటలకు ఎటువంటి పురుగు మందులు, రసాయన ఎరువులు, కెమికల్స్ వినియోగించమన్నారు. ఎచ్చెర్ల యూనిట్ ఇన్‌చార్జి సువ్వారి సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు ఖాళీ సీట్లు భర్తీ

ఎచ్చెర్ల క్యాంపస్: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను బుధవారం భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు తెలిపారు. అర్హత ఉన్నవారికి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐదో తరగతిలో ఎస్సీ కేటగిరీలో ఐదు, ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీలో ఎస్టీ–1, ఓసీ ఒకటి, బైపీసీలో ఎస్టీ మూడు సీట్లు ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. అలాగే ఐదో తరగతితో విద్యార్థుల సంఖ్య బట్టి ప్రవేశ పరీక్ష ద్వారా, ఇంటర్మీడియయెట్‌లో పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్‌తో ఉదయం తొమ్మిది గంటలకు అర్హత, ఆసక్తిగల విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. రిజర్వేషన్ రోస్టర్ పరిగణలోకి తీసుకొని ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు.

రణస్థలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



రణస్థలం: ర్యాలీ చేస్తున్న దృశ్యం

రణస్థలం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల ప్రకారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సూచనలతో హర్ ఘర్ తిరంగా అభియాన్ అవగాహన ర్యాలీని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నె శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. రణస్థలం జాతీయ రహదారిపై రెండు వందల ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓరుగంటి మాధవరావు, ఎన్ఈఆర్ స్కూల్ డైరెక్టర్ తేజ, యువ మొర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజాన రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ



సైకిల్ ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం హర్‌గర్ తిరంగా పేరిట సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 14వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన సుబేదార్ జితేంద్ర, హవల్దార్ అర్జున్‌తోపాటు 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీలో పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించగా.. కళాశాలల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ వై.పోలినాయుడు తదితరులు హాజరయ్యారు.

సమాన పనికి సమాన వేతనమివ్వాలి



మంత్రి అచ్చెన్నాయుడికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ సివిల్ సప్లయ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు నర్సింగరావు, రాజేశ్వరి, సురేష్ కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కుమార్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆందోళన చేస్తున్న రిమ్స్ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు

శ్రీకాకుళం: పశ్చిమబెంగాల్‌లో ఆర్‌జీకే మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం రిమ్స్ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు మంగళవారం తరగతులు బహిష్కరించి ధర్నా చేశారు. ఆస్పత్రి ఎదుట బైఠాయించి వైద్య విద్యార్థిని హత్యకు కారకులైన నిందితులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. అనంతరం డాక్టర్ జి.వెంకటేష్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ మోహిత్ కుమార్‌ల ఆధ్వర్యంలో సమావేశమై బుధవారం శ్రీకాకుళం పట్టణంలో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు.

పీడియాట్రిక్స్‌పై సేవలపై ప్రత్యేక శ్రద్ధ



బేబీ కిట్లు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్‌లో పీడియాట్రిక్స్ సేవల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ సుధీర్ అన్నారు. నాలుగు నెలల క్రితం అతితక్కువ బరువుతో చేరిన పిల్లలకు ప్రత్యేక చికిత్స అందించి మంగళవారం డిశ్చార్జ్ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లులుతో సమావేశం నిర్వహించి బేబీ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్, ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమంత్, జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్‌బ్యాంకులో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం అబ్దుల్ హసీబ్

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో మంగళవారం ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. మెయిన్‌బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అబ్దుల్ హసిబ్ హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ నెల 14 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. అనంతరం ఎస్‌బీఐలో పనిచేసిన పిహెచ్‌కె దాస్, మాజీ సైనికుడు టి.అప్పన్నలకు బ్యాంక్ ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు ఏర్పాట్లు



ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరగనున్న జిల్లాస్థాయి వేడుకలకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గ్యాలరీలు, స్టాళ్లు సిద్ధంచేస్తున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిసింది.

సిద్ధమౌతున్న శకటాలు..

వివిధ శాఖల ప్రగతిని ప్రదర్శించే శకటాలు సిద్ధమౌతున్నాయి. డ్వామా, పంచాయతీరాజ్, సమగ్ర శిక్ష-విద్యాశాఖ, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ తదితర శకటాలు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. మరోపక్క పోలీసులు మాక్‌డ్రిల్‌తోపాటు గౌరవవందనం సమర్పణకు సన్నద్ధమౌతున్నారు. విద్యార్థులు సైతం మాక్‌డ్రిల్ కోసం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శిక్షణ పొందుతున్నారు.

సంక్షిప్తంగా...

ధైర్యలక్ష్మిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలోవిజయదుర్గఆలయంలో నిజశ్రావణ మంగళవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని ధైర్యలక్ష్మిగా ప్రత్యేక అలంకరణ చేశారు. పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

'స్వచ్ఛంద' సేవలు అభినందనీయం



శ్రీకాకుళం అర్బన్: స్వచ్ఛంద సంస్థల సేవలు వెలకట్టలేనివని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులోగల ఓ ప్రయివేటు అతిథిగృహంలో యునైటెడ్ ఎన్ జీవోస్ సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు క్రీడాపోటీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. మామిడి క్రాంతి, కూన అన్నంనాయుడు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వివిధ విభాగాల్లో గాయత్రి, నీలవేణి, ఎం.అపర్ణ, ఎ.సంధ్యారాణి, కె.గణపతిరావు, డి.రామ్మోహనరావు, పి.మురళీధరరావు, చలపతిరావులు బహుమతులకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణచంద్, జల్లు తిరుపతి, అన్నపు భువనేశ్వర్, ఆగూరి ఉమామహేశ్వరరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సైన్స్‌కిట్ల పంపిణీ



శ్రీకాకుళం న్యూకాలనీ: యూత్‌క్లబ్, బెజ్జిపురం వరుసగా ఈ విద్యా సంవత్సరంలోనూ తన వితరణ కార్యక్రమాలను చేపట్టింది. పాఠశాల సంసిద్ధత, బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, పొందూరు, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని 63 ఉన్నత పాఠశాలలు, 10 జూనియర్ కాలేజీల్లో 2023–24 విద్యా సంవత్సరంలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు బహుమతులు అందజేసింది. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్‌హాల్ వేదికగా యూత్‌క్లబ్ బెజ్జిపురం పీడీ ఎం.ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటర్‌విద్య డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు, ఆర్‌ఐఓ పి.దుర్గారావు, డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య చేతులమీదుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు, 40 పాఠశాలలకు సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీవైఈఓ ఆర్.విజయకుమారి, శ్రీకాకుళం జీజీసీ బాలికల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి, ఎంఈఓలు వినోదిని, బి.లావణ్య, హెచ్‌ఎంలు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.